క్లుప్తంగా

నేడు ఉగాది వేడుకలు

తిరుపతి అర్బన్: తిరుపతి నగరంలోని కచ్చపి ఆడిటోరియంలో ఆదివారం ఉగాది వేడుకలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉత్సవాలు జరుగుతాయని చెప్పారు. పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనం, ఉగాది పురస్కారాలు తదితర కార్యక్రమాలు నిర్వహించబడుతాయన్నారు. అలాగే స్కాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టి పోటీల్లో గెలిచిన వారికి బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ఉగాది వేడుకలకు అందరూ ఆహ్వానితులేనని తెలిపారు. కలెక్టర్‌తోపాటు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు.

వేడుకగా ఆస్థానం



ఆస్థానం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుపతి కల్చరల్: అన్నమాచార్య కళామందిరంలో జరిగిన అన్నమయ్య 522వ వర్ధంతి మహోత్సవాల్లో భాగంగా చివరిరోజు శనివారం శ్రీగోవిందరాజస్వామి వారి ఆస్థానం వేడుకగా నిర్వహించారు. అనంతరం అన్నమయ్య రచించిన సంకీర్తనలను ప్రాజెక్టు కళాకారులు గానం చేశారు. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈఓ శాంతి, అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు రాజగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ప్రసాదాల వితరణ



అన్నప్రసాదాలు వితరణ చేస్తున్న రంగస్థలి ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: నగర సంకీర్తన చేపట్టిన భజన మండళ్ల సభ్యులు, భక్తులకు రంగస్థలి ఆధ్వర్యంలో శనివారం ప్రసాదాలు వితరణ చేశారు. ఆధ్యాత్మిక నగరంలో భక్తి భావాలను పెంపొందించే దిశగా స్థానిక భజన కళాకారులు నగరంలో గోవిందనామ సంకీర్తనలను ఆలపిస్తూ ప్రదర్శన చేపడుతూ ఆధ్యాత్మిక భక్తిని చాటుతున్నారు.

'వీక్ష'లో ముందస్తు ఉగాది వేడుకలు



ఉగాది సంబరాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

తిరుపతి సిటీ: స్థానిక వీక్ష ది స్కూల్‌లో శనివారం ముందస్తు ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెలుగుదనం ఉట్టిపడేలా సంప్రదాయ దుస్తులు ధరించి ఉగాది సంబరాల్లో పాల్గొన్నారు. స్కూల్ చైర్మన్ డాక్టర్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఉగాది షడ్రుచులు మన జీవితంలో భాగస్వామ్యం అవుతాయన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు

క్రమశిక్షణకు మారుపేరు హరికృష్ణ



గురున్నాథంను సన్మానిస్తున్న డీఎం హరిబాబు, అసిస్టెంట్ డీఎం పుష్పలత, ఆర్టీసీ ఉద్యోగులు

తిరుపతి అర్బన్: అలిపిరి ఆర్టీసీ డిపోలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన డి.గురున్నాథం క్రమశిక్షణకు మారుపేరుగా చెప్పవచ్చని అలిపిరి డీఎం హరిబాబు, అసిస్టెంట్ డీఎం పుష్పలత కొనియాడారు. శనివారం అలిపిరి డిపోలో గురున్నాథంను ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ రీజనల్ కార్యదర్శి వి.మస్తాన్, అలిపిరి డిపో అధ్యక్షులు ఏబీఎస్ మణి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

తిరుపతి అర్బన్: చట్టాలపై అందరికీ అవగాహన ఉండాలని తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్ తెలిపారు. తిరుపతి ఆర్డీఓ కార్యాలయంలో శనివారం రాత్రి ఎస్సీ, ఎస్టీ పీఓఏ యాక్ట్, ప్రివెన్షన్ ఆఫ్ మ్యాన్యువల్ స్కావెంజర్స్ డివిజనల్ స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ పరిధిలోని డీఎస్పీలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీపీలు, ఎన్జీఓలు, డీవీఎంసీ సభ్యులు హాజరయ్యారు.

బంగారు తిరుచ్చిపై సుందరరాజస్వామి



తిరుచ్చిపై విహరిస్తున్న శ్రీసుందరరాజస్వామి

తిరుపతి రూరల్ : తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి అనుబంధ ఆలయంలో కొలువైన శ్రీ సుందర రాజస్వామి వారు శనివారం బంగారు తిరుచ్చిపై మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి జన్మనక్షత్రం ఉత్తరాభాద్ర సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీ సుందరరాజస్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించి తిరుచ్చి పై కొలువుదీర్చారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ దేవరాజులు, సూపరింటెండెంట్ రమేష్, ఇన్‌స్పెక్టర్లు సుభాస్కర్ నాయుడు, చలపతి, సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాలకవర్గం రద్దుకు.. కూటమి కుట్రలు

- టౌన్‌బ్యాంకులో ఎలాంటి అవకతవకలు జరగకపోయినా 51 ఎంక్వైరీలు
- భూమన కరుణాకరరెడ్డి కృషితో టీటీడీ నుంచి రూ.10 కోట్లు డిపాజిట్లు
- రూ.37 కోట్ల మొండి బకాయిలను వసూలు చేసిన ఘనత మా పాలకవర్గానిదే
- టౌన్‌బ్యాంక్ మహాజనసభలో చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి వెల్లడి



టౌన్‌బ్యాంక్ మహాజనసభలో మాట్లాడుతున్న బ్యాంక్ చైర్మెన్ కేతం జయచంద్రారెడ్డి

తిరుపతి మంగళం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజకీయ కక్ష సాధింపులు మితిమీరిపోయాయని, అందులో భాగంగా తిరుపతి కో-ఆపరేటివ్ బ్యాంక్(తిరుపతి టౌన్‌బ్యాంక్) పాలకవర్గాన్ని రద్దు చేయించేందుకు కూటమి నాయకులు కుటిల యత్నాలు చేస్తున్నారని బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతి కో-ఆపరేటివ్ బ్యాంక్ ఆవరణలో శనివారం బ్యాంక్ ఖాతాదారులు, ఉద్యోగులతో మహా జనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022 జులై 22న బ్యాంకు ఖాతాదారులచే తిరుపతి టౌన్ బ్యాంక్‌కు నూతన పాలకవర్గంగా 12 మంది ఎన్నికయ్యామని గుర్తు చేశారు. అయితే తాము బాధ్యతలు చేపట్టినప్పటి వందేళ్ల టౌన్‌బ్యాంక్ చరిత్రలో ఎన్నడూ లేనంతగా గత మూడేళ్లల్లో బ్యాంకు అభివృద్ధితో పాటు ఖాతాదారులకు విశేష సేవలందించామన్నారు. ఏళ్ల తరబడి వసూలు కాని రూ.37 కోట్ల మొండి బకాయిలను వసూలు చేశామన్నారు. ఖాతా దారులకు ఆర్బీఐ నుంచి డివిడెంట్లు కూడా వచ్చాయన్నారు. అలాగే బ్యాంకును మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు అప్పటి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి చొరవతో టీటీడీ నుంచి టౌన్‌బ్యాంక్‌కు రూ.10 కోట్లు డిపాజిట్లు చేయించిన ఘనత కూడ తమదేనన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తమ పాలకవర్గంపై కక్ష సాధింపులకు పాల్పడుతూ బ్యాంక్ అభివృద్ధిని అడుగడుగునా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందులో భాగంగానే టీటీడీ నుంచి తీసుకొచ్చిన రూ. 10కోట్ల డిపాజిట్లను కూడ వెనక్కి తీసుకునేలా చేశారని మండిపడ్డారు. చేతనైతే బ్యాంక్ అభివృద్ధికి తోడ్పడాలే తప్ప నాశనానికి కాదని ఎద్దేవా చేశారు. బ్యాంక్‌లో ఎలాంటి అవకతవకలు జరగకపోయినా కూటమి నాయకులు ప్రోద్బలం, మంత్రి ఆదేశాలతో 51 ఎంక్వైరీ వేయడం వారి దురాగతాలకు నిదర్శనమన్నారు. తాము అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు ఆధారాలు ఉంటే పాలకవర్గం రద్దు చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నామన్నారు. మహాజనసభలో టౌన్‌బ్యాంక్ వైస్ చైర్మన్ వాసుయాదవ్, డైరెక్టర్లు పోలిరెడ్డి నాగిరెడ్డి, కడపగుంట అమరనాథరెడ్డి, జ్యోతిప్రకాష్, మహ్మద్ ఖాసీం, మబ్బు నాదమునిరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, మాకం చంద్రయ్య, సురేష్‌రెడ్డి, బాలాజిరెడ్డి, చింతారమేష్, బ్యాంక్ ఎండీ శివకుమార్, ఖాతాదారులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యానికి ఆద్యుడు తాళ్లపాక



మాట్లాడుతున్న ఆచార్య గోవిందరాజు

తిరుపతి కల్చరల్: తెలుగు పద సాహిత్యానికి తాళ్లపాక అన్నమాచార్యులు ఆద్యుడని, ఆయన పద సంపదను భావితరాలకు అందించాలని ఎస్వీ ప్రాచ్య పరిశోధనా సంస్థ విశ్రాంత ఆచార్యుడు ఆచార్య గోవిందరాజు తెలిపారు. గత మూడు రోజులుగా అన్నమాచార్య కళామందిరంలో చేపట్టిన అన్నమయ్య 522వ వర్ధంతి మహోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన 'తాళ్లపాక కవులు-వివిధ సేవలు' అనే అంశంపై ఉపన్యసించారు. ఎస్వీ ఓరి యెంటల్ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ హేమంతకుమార్ 'అన్నమయ్య సంకీర్తనలలో ఆధ్యాత్మిక చింతన' అనే అంశంపై ఉపన్యసించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సాహితీవేత్త శంకరావు 'అన్నమయ్య పద సాహిత్యం-పరిష్కర్తల కృషి' అనే అంశంపై ప్రసంగించారు. నాగేశ్వరనాయుడు బృందం సంకీర్తనాగానం, రాజమండ్రికి చెందిన విజయలక్ష్మి బృందం చేపట్టిన హరికథా గానం ఆకట్టుకుంది.

శ్రీవారి సేవలో ప్రముఖులు







అరకు ఎంపీ తనుజారాణి, మండలి చైర్మన్ మోషన్ రాజు, దర్శకుడు తరుణ్ భాస్కర్, సినీనటి ఈషారెబ్బా

తిరుమల: తిరుమల శ్రీవారిని అరకు ఎంపీ తనుజారాణి, మండలి చైర్మన్ మోషన్ రాజు, సినీనటి ఈషారెబ్బా, దర్శకుడు తరుణ్ భాస్కర్ శనివారం వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

ముగిసిన బహిరంగ వేలం

- చంద్రగిరి ఇన్‌చార్జ్ ఎంపీడీఓ తీరుతో రూ.5 లక్షల మేర నష్టం
- మండిపడుతున్న స్థానిక ప్రజలు



పంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహిస్తున్న అధికారులు

చంద్రగిరి: చంద్రగిరి పంచాయతీ ఆదాయ వనరుల బహిరంగ వేలం శనివారం ప్రశాంతంగా ముగిసింది. సర్పంచ్ ముదికుప్పం రూపరామ్మూర్తి అధ్యక్షతన పంచాయతీ వేలం పాట ప్రక్రియను ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటరత్నం నిర్వహించారు. వారపు సంతను కొత్తపేటకు చెందిన కాపువీధి సునీల్ రూ.24.04 లక్షలకు వేలంలో దక్కించుకోగా, బస్టాండ్‌ను వెంకటరెడ్డి రూ.7.61 లక్షలకు, జంతువధశాలను చోటు రూ.2.42 లక్షలకు సొంతం చేసుకున్నారు.

రూ.5 లక్షల మేర నష్టం

గత రెండు రోజుల కిందట వారపు సంతను టీడీపీ నాయకుల ఆదేశాలతో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటరత్నం వేలం వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఆపై శనివారం నిర్వహించిన వేలంలో కేవలం రూ.24.04 లక్షలకే సంతను అధికార పార్టీ నేతలు దక్కించుకున్నారు. గుత్తేదారులు సిండికేట్‌గా మారి అతి తక్కువకే వారపు సంతను చేజిక్కించుకోవడం విమర్శలకు తావిస్తోంది. సుమారు రూ.29 లక్షల వేలం పాటను రద్దు చేసి ప్రస్తుతం రూ.24 లక్షలకే అధికార పార్టీ వారికి కట్టబెట్టడంపై స్థానికులు మండిపడుతున్నారు. దీంతో పంచాయతీకి తీవ్ర నష్టం వాటిల్లిందంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పాస్టర్ ప్రవీణ్‌కు నివాళి

తిరుపతి కల్చరల్: క్రైస్తవ సమాజం పాస్టర్ పగడాల ప్రవీణ్‌ను కోల్పోవడం అత్యంత బాధాకరమని, ఆయన మృతి పట్ల ప్రభుత్వం తక్షణం స్పందించి సమగ్ర విచారణ చేపట్టి ప్రజల అనుమానాలను నివృత్తి చేయాలని బిషప్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్, పాస్టర్ అరుల్ అరుసు డిమాండ్ చేశారు. తిరుపతి యునైటెడ్ క్రిస్టియన్ చర్చిస్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం తిరుపతి వెస్ట్ చర్చి వెలుపల పాస్టర్ పగడాల ప్రవీణ్‌కు అన్ని క్రైస్తవ సంఘాల విశ్వాసకులు కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించి సంతాపాన్ని తెలియజేశారు.

బంగారు భవితకు వేదిక టాలెంట్ ఫెస్ట్



విజయ వైజయంతి పురస్కారాన్ని అందుకుంటున్న ఎన్‌ఎస్‌యూ విద్యార్థులు

తిరుపతి సిటీ: విద్యార్థుల బంగారు భవితకు బాటలు వేసే అత్యుత్తమ వేదిక టాలెంట్ ఫెస్ట్ అని మహిళా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ తెలిపారు. జాతీయ సంస్కృత వర్సిటీ వేదికగా గత మూడు రోజులుగా జరిగిన ఆల్ ఇండియా సాంస్క్రిట్ స్టూడెంట్ టాలెంట్ ఫెస్ట్ శనివారం ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. జాతీయ స్థాయి టాలెంట్ ఫెస్ట్‌లో 20 వర్సిటీల విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపడం అభినందనీయమన్నారు. జాతీయ స్థాయి టాలెంట్ ఫెస్ట్‌లో సుమారు 20 వర్సిటీల నుంచి 250 మంది విద్యార్థులు విచ్చేసి 14 విభాగాల్లో జరిగిన పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరచిన తిరుపతి జాతీయ సంస్కృత వర్సిటీ విద్యార్థులకు విజయ వైజయంతి పురస్కారం లభించింది. కార్యక్రమంలో వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, విశిష్టాద్వైత వేదాంత విభాగ అధ్యక్షుడు ప్రొఫెసర్ దేవనాథన్, డీన్లు రజనీకాంత్, ప్రొఫెసర్ దక్షిణమూర్తి శర్మ, ప్రొఫెసర్ రంగనాథన్, సత్యనారాయణాచార్య, కోర్డినేటర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి



ఎంపీపీని సత్కరిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

తిరుపతి రూరల్ : 'గ్రామ పంచాయతీల్లో ప్రజలకు అవసరమైన న్యాయమైన పనులు ఎవరు చెప్పినా చేయండి..రాజకీయాలు చేస్తామంటే కచ్చితంగా మండల తీర్మానం చేసి జిల్లా అధికారులకు మిమ్మల్ని సరెండర్ చేయడానికి వెనుకాడం..' అంటూ తిరుపతి రూరల్ మండలం ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి హెచ్చరించారు. శనివారం తిరుపతి రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ఆయన పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో జరిగే అభివృద్ధి పనులకు సంబంధించిన రెజల్యూషన్ విషయంలో పంచాయతీ కార్యదర్శులు సర్పంచ్‌లను అనుసరించుకుని వెళ్లాలని సూచించారు. ప్రతిపక్షం, అధికార పక్షం అనే తేడాలు చూపించకుండా పంచాయతీల్లో సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ వరకు అందరికీ అధికారిక కార్యక్రమాలను తెలియపరచి గౌరవించాలన్నారు. అనంతరం వైస్ ఎంపీపీలు యశోద, మాధవరెడ్డి, ఎంపీడీవో రామచంద్ర, ఈవోపీఆర్‌డీ మాదురిలు పాల్గొన్నారు.

నూతన ఎంపీపీకి సత్కారం

తిరుపతి రూరల్ మండల ఎంపీపీగా ఎన్నికైన మూలం చంద్రమోహన్ రెడ్డిని ఎంపీడీఓ రామచంద్రతో పాటు మండల పరిషత్ కార్యాలయ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సత్కరించారు. శనివారం పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనకు పుష్పగుచ్చాలు, శాలువలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

ప్లాస్టిక్ నిర్మూలన భావితరాల భద్రత



క్లాత్ బ్యాగులను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి కల్చరల్: ప్లాస్టిక్ నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ, భావితరాల భద్రత ప్రజలందరి బాధ్యత అని, ఆ దిశగా ముందడుగు వేసి పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్యకర సమాజ స్థాపనకు కృషి చేయాలని కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువఅన్వేష్, ఆచార్య గురునాథ నాయుడు తెలిపారు. యాంటీ ప్లాస్టిక్ అవేర్‌నెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం గంధమనేని శివయ్య భవన్‌లో వ్యాపారులు, విద్యార్థులకు 'ప్లాస్టిక్ మహమ్మారిని పారదోలి భావితరాలను కాపాడుకుందాం' అంశంపై అనే అవగాహన కార్యక్రమం చేపట్టారు.అనంతరం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, మున్సిపల్ కమిషనర్ మౌర్యను నిర్వాహకులు సత్కరించి క్లాత్ బ్యాగులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రియల్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి కృష్ణమూర్తి, యాంటీ ప్లాస్టిక్ అవేర్‌నెస్ అసోసియేషన్ ఫౌండర్ సర్దార్ శివకుమార్, సభ్యులు, మెప్మా సీఎంఎం, సీతఓలు, వీధి వ్యాపారులు పాల్గొన్నారు.

సింహ వాహనంపై శ్రీకోదండరాముడు





సింహ వాహనంపై దర్శనమిస్తున్న శ్రీకోదండరామస్వామి, దేవతామూర్తుల వేషధారణలో కళాకారులు

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవరోజు శనివారం ఉదయం శ్రీరామచంద్రమూర్తి సింహ వాహనాన్ని అధిరోహించి విహరిస్తూ భక్తులను దర్శనమిచ్చారు. ఉదయం 7 నుంచి ఆరంభమైన స్వామివారి హంసవాహన సేవ గజరాజులు ముందు కదులుతుండగా, భక్త బృందాల భజనల నడుమ మంగళ వాయిద్యాల మధ్య స్వామివారి వాహనసేవ కోలాహలంగా సాగింది. రాత్రి స్వామివారి ముత్యపు పందిరి వాహన సేవ వేడుకగా సాగింది. సర్వాంగసుందర అలంకరణలో కొలువైన శ్రీకోదండరామస్వామి ముత్యపు పందిరి వాహనంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ రవి, సూపరింటెండెంట్ మునిశంకరన్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.